## బోథ్ అభివృద్ధి పై మంత్రి అడ్లూ రి లక్ష్మణ్తో ఆడే గజేందర్ భేటీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బోథ్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం హైదరాబాద్లోని మంత్రి క్వార్టర్స్లో రాష్ట్ర దళిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ ంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, సంక్షేమ కార్యక్రమాలు ప్రతి గడపకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. బోథ్ నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ంలో పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి, అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

## పెగడపల్లి లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెగడపల్లి గ్రామంలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్ పనులను ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద రూ.4లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొల్లూరి సంగీత ప్రకాష్, వార్డు సభ్యులు దుర్గ ం శ్రీలత, జంబోజుల ప్రవీణ్, ఏసం చంద్రశేఖర్, మాదారం ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సిద్ధం అశోక్, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొ న్నారు.

## గ్రామాల్లో వైద్య శిబిరాలు

### డయేరియా నివారణపై ప్రజలకు అవగాహన



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని గుత్పాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అద్దాల తిమ్మాపూర్, లక్ష్మీపూర్ సబ్ సెంటర్ల ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలతో పాటు "స్టాప్ డయేరియా" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ పవార్ రవీందర్ మాట్లాడుతూ వర్షాకాలంలో అతిసార వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అతిసార వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెస్రం సీతారాం, హెల్త్ సూపర్వైజర్లు సంతోష్, స్వర్ణలత, హెచ్ఏ సాయన్న, ఆశా కార్యకర్త ఆత్రం పార్వతి, అంగన్వాడీ టీచర్ సెడం శిరీష, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

## ఆదర్శ కళాశాలలో లెక్చరర్ పోస్టులు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల (మోడల్ స్కూల్)లో వివిధ సబ్జెక్టులలో గంటల ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీగా బోధించేందుకు అర్హులైన అధ్యాపకుల నియామకం చేపట్టనున్నట్లు ప్రిన్సిపల్ దుర్గం మహేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న రసాయన శాస్త్రం (కెమిస్ట్రీ) ఒక పోస్టు, జంతు శాస్త్రం (జువాలజీ) ఒక పోస్టు భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో M.Sc తో పాటు B.Ed అర్హత కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థులు 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 17వ తేదీ నుండి 19వ తేదీ వరకు తమ బయోడేటాతో పాటు విద్యార్హతల పత్రాలను తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు కళాశాలలో సమర్పించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 18,200 వేతనం ఉంటుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఇతర పూర్తి వివరాలకు 8106512531 ఫోన్ నంబర్లో సంప్రదించాలని ఆయన కోరారు.

# విధుల్లో అలసత్వం వద్దు

- ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** విధుల నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అధికారులకు సూచించారు. మంగళవారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి మండలానికి చెందిన ఆర్ఐలు, జీపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వేంసూరు మండల తహశీల్దార్, ఎంపీడీఓతో పాటు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేంసూరు మండలంలోని గ్రామాల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, వాటి పరిష్కార చర్యలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ సచివాలయ కార్యదర్శులు, జీపీఓలు, హౌసింగ్ ఏఈల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. కొంత మంది అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, ఇటీవల నిర్వహించిన ప్రజా దర్బార్లో వచ్చిన దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా అత్యవసరంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే 'బడిబాట' కార్యక్రమం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, విద్యా ప్రమాణాలపై ఎంఈఓతో చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతిఒక్కరికీ చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ సమావేశంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా, వివిధ శాఖల అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల మహా గర్జన ధర్నాను విజయవంతం చేయాలి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టనున్న "ఉద్యమ కారుల మహా గర్జన" ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక బెజ్జూర్ మండల అధ్యక్షుడు లింగన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, , గుర్తింపు పత్రాలు, బస్సు, రైళ్లలో ఉచిత ప్రయాణ సదుపాయాలు కల్పించడంతో పాటు అర్హతలను బట్టి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఉద్యమకారుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చేయూత అందించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చడమే ఈ మహా గర్జన ధర్నా ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఉద్యమ కారులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొ ని ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. "ఇది ఒక్కరి సమస్య కాదు.. ఉద్యమంలో పాల్గొన్న ప్రతిఒక్కరి హక్కుల సాధన కోసం జరుగుతున్న పోరాటం.. పార్టీలకు అతీతంగా అందరూ కదిలిరావాలి.. మన గొంతు ప్రభుత్వానికి వినిపించేలా ధర్నాను విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. ధర్నాను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నామని, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## తెలంగాణ ఉద్యమకారుల మహా గర్జన సభను జయప్రదం చేయండి



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఈనెల 18న హైదరాబాద్లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల మహా గర్జన సభను జయప్రదం చేయాలని తాండూర్ మండల తెలంగాణ ఉద్యమకారుల వేదిక అధ్యక్షుడు నిరంజన్ రావు, టీయూవీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దిబోయిన అర్జున్ పిలుపునిచ్చారు. మంగళవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మహా గర్జన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన లక్ష్యంగా ఈ సభ జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని ఉద్యమకారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రభుత్వం గుర్తించి తగిన న్యాయం చేయాలనే డిమాండ్తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాండూర్ మండలం నుంచి సభకు హాజరయ్యే వారు ముందస్తుగా సెల్: 9502257595, 9440141287 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారులంతా ఐక్యంగా పాల్గొని మహా గర్జన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# సర్పంచ్ బుర్రా పోచయ్యకు సన్మానం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న వృద్ధి, పారిశుద్ధ్య పనులపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక మైనార్టీ సోదరులు సర్పంచ్ బుర్రా పోచయ్యను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని వార్డులు, ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, క్లీనింగ్ పనులు మరియు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయి. గ్రామ ప్రగతి కోసం నిరంతరం శ్రమిస్తున్న సర్పంచ్ సేవలను అభినందిస్తూ మైనార్టీలు ఆయనకు శాలువాతో ఘనంగా సన్మానించారు. మైనార్టీలకు సంబంధించిన హుద మజీద్ ఖబ్రస్తాన్లో పేరుకుపోయిన చెట్లు, పొదలను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా మార్చడం పట్ల వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఖబ్రస్తాన్కు శాశ్వత రక్షణ కల్పించేలా కాంపౌండ్ వాల్ నిర్మించాలని మైనార్టీ సోదరులు సర్పంచ్కు వినతిపత్రం అందజేశారు. దీనిపై సర్పంచ్ బుర్రా పోచయ్య సానుకూలంగా స్పందిస్తూ, నిధుల కేటాయింపుతో కాంపౌండ్ వాల్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుద మజీద్ కమిటీ అధ్యక్షుడు ముబీన్, కమిటీ ప్రతినిధులు అబ్దుల్లా, నాసర్, అబ్బు, ముబాషిర్, సలీం, రియాజ్ పాల్గొ న్నారు.

## కుళాయిల ద్వారా స్వచ్ఛమైన నీరు

- ఆర్ డబ్ల్యు ఎస్ డి ఈఈ లక్ష్మి

**ఉద్యమ కెరట, హత్నూర:** కుళాయిల ద్వారా అందించే స్వచ్ఛమైన నీటిని తాగాలని ఆర్డబ్ల్యూఎస్ డి ఈఈ లక్ష్మి అన్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ గ్రామంలో బుధవారం హర్ ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డి ఈఈ లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఇంటికి కులాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తుందని తెలిపారు. ఇతర కంపెనీల పేరుతో వచ్చే నీటి కంటే కుళాయిల ద్వారా సరఫరా చేసే నీళ్లే స్వచ్ఛమైనదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్ గౌడ్ స్థానిక సర్పంచ్ శ్రీహరి, ఉప సర్పంచ్ గునుకుంట్ల శంకర్, గ్రామ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వార్డు సభ్యులు జగన్ యాదవ్, సేరి సంతోష బాబు, మన్నే అశోక్, ఖైరతాలి తదితరులు పాల్గొ న్నారు.



## లోదిగూడలో ఉచిత వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని లోదిగూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జైనూర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ ముక్తి శ్రీధర్, డెంటల్ సర్జన్ రాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్తో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. మొత్తం 48 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, 21 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి పలు ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ, హెచ్ఈఓ, మల్టీ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గింజ కొన్నాం

- రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.83 కోట్లు
- మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇచ్చిన మాట ప్రకారం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేశామని, రైతుల ప్రయోజనాల కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు బిడ్డగా రైతులు ఎదుర్కొనే సమస్యలు తనకు బాగా తెలుసని, గతంలో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టి లో ఉంచుకుని ఈసారి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సీజన్లో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో 7,680 మంది రైతుల నుంచి 2,23,675 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు వివరించారు. ఇందుకు సంబంధించిన సుమారు రూ.83 కోట్ల చెల్లింపులు రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. శనగల కొనుగోలుకు సంబంధించిన చెల్లింపులు ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు త్వరలో ప్రతి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విధాలుగా సహకరిస్తూ వారి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియ విజయవంతానికి సహకరించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, మార్క్ఫెడ్ డీఎం మహేష్, జిల్లా మార్కెట్ అధికారి గజానంద్, మార్కెట్ కమిటీ సభ్యులు, సొసైటీ చైర్మన్లు, సీఈఓలు, హమాలీలు, రవాణా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ సభ్యులు తాటి అశోక్, మూదెల పోశెట్టి, నాయకులు రేండ్ల రాజన్న, మోసిన్, అట్ల గోవర్ధన్ రెడ్డి, అలీం, శుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు ల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ప్రధాన కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జర్నలిస్టుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయు) పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్ లు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై యూనియన్ నిరంతరం పోరాడుతుందని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా యూనియన్ తరపున చూస్తామన్నారు. జర్నలిస్టుల హక్కుల రక్షణకు టీయూడబ్ల్యూజే ఎల్ల ప్పుడూ ముందుంటుందని చెప్పారు.జిల్లాలోని జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి, ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. యూనియన్ బలోపేతంతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి అడప సతీష్, టీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి దేవునూరి రమేష్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ కోశాధికారి శ్రీధర్, టీయూడబ్ల్యూజే ప్రతినిధులు, జర్నలిస్టులు మేకల శ్రీనివాస్, సురేష్ చారి, భాస్కర్ చారి, రాధాకృష్ణ చారి, నితీష్ కుమార్, జానకిరామ్, రాజ్ కుమార్, శ్రీనివాస్, తిరుపతి, కిషోర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగ నూతన చైర్మన్ కి సన్మానం



**ఉద్యమ కెరటం : ఆదిలాబాద్ టౌన్:** తెలంగాణ రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగాల అధ్యక్షుల జాబితా నిన్న విడుదలైంది. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగ చైర్మన్గా ఎంపికైన సయ్యద్ షాహిద్ అలీ ని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు,మైనారిటీ నాయకులు ఆయనను శాలువాతో సన్మానించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగ నూతన చైర్మన్ సయ్యద్ షాహిద్ అలీ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర టీ పీసీసి చైర్మన్ మహేష్ కుమార్ గౌడ్ కి,రాష్ట్ర మైనారిటీ కాంగ్రెస్ చైర్మన్ మొహమ్మద్ ఇర్ఫాన్ అలీ కి , రాష్ట్ర మైనారిటీ కాంగ్రెస్ ఏఐసిసి ఇంచార్జ్ హెచ్ ఏం షకీల్ నావాజ్ కి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ జాదవ్ కి, ఆదిలాబాద్ నియోజకవర్గం ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కి, బోత్ నియోజక వర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ కి,గండ్రత్ సుజాత కి, అల్లూ రి సంజీవ రెడ్డి కి, మాజీ డీసీసీ సాజిద్ ఖాన్ కి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులకి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగంగానే పట్టణ కాంగ్రెస్ కు మైనారిటీని అధ్యక్షుడిగా చేసిందని, మైనారిటీల ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, జిల్లా కాం గ్రెస్ నాయకులు కుల మత వర్గ విభేదాలు లేకుండా అందరినీ కలుపుకుంటూ పోతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజార్ పాషా , జిల్లా కాంగ్రెస్ జెనరల్ సెక్రెటరీలు గౌలి సంజయ్ కుమార్ ,అక్తర్ అలీ , మాజీ టీటీడీ బోర్డు మెంబర్ బెజ్జంకి అనిల్ కుమార్, యువజాన కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్, సేవాదల్ అఫ్సర్ , అశోక్ గౌడ్ ,ముర్తుజా , మునీర్ , ఖలీల్ , అజీజ్ , రిజ్వాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** విశ్వబ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్లు ,నెలకు రూ.4వేల పెన్షన్ మంజూరు చేసి వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని వేంసూర్ మండల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. వేంసూర్ మండలంలోని మర్లపాడు గ్రామ సాయిబాబా ఆలయంలో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. సంఘం అధ్యక్షుడు రాంపల్లి కృష్ణమాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల లో మండలంలోని విశ్వబ్రాహ్మణులకు కేవలం రెండు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మొదటి విడతలో మండలానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ విశ్వబ్రాహ్మణులకు కేవలం మూడు ఇళ్లు మాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో విడతలోనైనా ప్రతి గ్రామానికి కనీసం రెండు చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి అవసరమైన పనిముట్లు తయారు చేస్తూ రైతులకు వెన్నెముకగా నిలిచిన విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెడీమేడ్ వస్తువుల వినియోగం పెరగడంతో సంప్రదాయ వృత్తులు దెబ్బతిని విశ్వబ్రాహ్మణులు జీవనాధారం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 45 సంవత్సరాలు నిండిన విశ్వబ్రాహ్మణులకు నెలకు రూ.4వేల పెన్షన్ మంజూరు చేసి వారి ఆర్థిక భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## జైనూర్ మండల సర్పంచ్ సంఘాన్ని బహిష్కరిస్తున్నాం

- మహిళలకు ప్రాధాన్యత లేకుండా ఏకపక్షంగా కమిటీ ఏర్పాటు చేశారని ఆరోపణ

**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండల సర్పంచ్ల సంఘం ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తూ తాము ఆ సంఘాన్ని బహిష్కరిస్తున్నట్లు పలువురు సర్పంచ్లు ప్రకటించారు. కమిటీని అన్ని సర్పంచుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ఏర్పాటు చేశారని ఆరోపించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు సర్పంచ్లు మాట్లాడుతూ తమకు తెలియకుండా రాథోడ్ రాందాస్ను గౌరవాధ్యక్షుడిగా, ఉయిక చందన్ షాను ఉపాధ్యక్షుడిగా ప్రకటించడాన్ని ఖండించారు. తమకు కేటాయించిన పదవులను తాము తిరస్కరిస్తున్నట్లు వివరించారు. మండలంలో మొత్తం 26 మంది సర్పంచ్లు ఉండగా, వారిలో 13 మంది మహిళా సర్పంచ్లు ఉన్నప్పటికీ ఒక్క మహిళకు కూడా కార్యవర్గంలో పదవి ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. మహిళా ప్రజాప్రతినిధులకు సరైన ప్రాధాన్యత కల్పించకుండా కమిటీ ఏర్పాటు చేయడం అన్యాయమని విమర్శించారు. మహిళల గౌరవాన్ని కాపాడే విధంగా, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండల సర్పంచ్ల సంఘం ఎన్నికలను మరోసారి నిర్వహించి పారదర్శకంగా కొత్త కమిటీని ఎన్నుకోవాలని కోరారు. ఈ దృష్ట్యా ప్రస్తుత సర్పంచ్ సంఘాన్ని పూర్తిగా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో సర్పంచ్లు కనక ప్రతిభ, మాడవి మనోహర్, తొడసం రాజేందర్, దుర్వ సింధు, ఉయిక చందు, పెందోర్ అనుసయా అర్జున్, జాదవ్ జానుబాయి గణపత్, ఆత్రం అయ్యు భుజంగ్రావు, ఆత్రం నిర్మల శేషరావు, గురులే గంగాసాగర్ గుణాజీ తదితరులు పాల్గొన్నారు.



## బీఎల్ఏలు అప్రమత్తంగా పనిచేయాలి

- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ
- ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం



**ఉద్యమ కెరటం, జైనూర్:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం జైనూర్ మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేయడంతో పాటు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఓటరు జాబితాల పరిశీలనలో అప్రమత్తంగా వ్యవహరించి పార్టీ కి అనుకూలంగా పనిచేయాలని కోరారు. గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించి, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఎస్ఐఆర్ ప్రక్రియ, బీఎల్ఏల బాధ్యతలు, ఓటరు జాబితాల పరిశీలన, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో సర్పంచ్లు కనక ప్రతిభ, మాడవి మనోహర్, తొడసం రాజేందర్, దుర్వ సింధు, ఉయిక చందన్ షా, రాథోడ్ రాందాస్, ఉయిక చందు, పెందోర్ అనుసయా అర్జున్, జాదవ్ జానుబాయి గణపత్, ఆత్రం అయ్యు భుజంగ్ రావు, ఆత్రం నిర్మల శేషరావు, గురులే గంగాసాగర్ గుణాజీ, కాంగ్రెస్ నాయకులు చిల్లే లక్ష్మణ్, రషీద్, మెస్రం అంబాజీరావు, ఆత్రం శంకర్రావు, జల్పత్రావు తదితరులు పాల్గొన్నారు.

# డీఎంహెచ్ఓ డాక్ట ర్ నరేందర్ రాథోడ్కు ఘన సన్మానం




**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నరేందర్ రాథోడ్ను తలసేమియా సికిల్ సెల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధి కాసర్ల శ్రీనివాస్ జిల్లాలోని తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను డీఎంహెచ్ఎ దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలోని తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొజ్జా వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి అవినాష్, జాయింట్ సెక్రటరీ రత్నం తిరుపతి, ప్రతినిధులు దుర్గం ప్రవీణ్ కుమార్, గాండ్ల స్వాతి, డి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బట్ట లు ఉతుకుతూ చెరువులో జారి యువతి మృతి

**మల్లా రెడ్డి పేట గ్రామంలో విషాదం**





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం మల్లా రెడ్డిపేట గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. బట్టలు ఉతకడానికి వెళ్లిన ఓ యువతి ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లా రెడ్డిపేట గ్రామానికి చెందిన బంటు జ్యోతి (28) మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని చెరువు వద్దకు బట్ట లు ఉతకడానికి వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోవడంతో నీటిలో మునిగిపోయింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే చెరువులోకి దిగి ఆమెను బయటకు తీసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న గంభీరావుపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నట్లుగంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. జ్యోతి ఆకస్మిక మృతితో మల్లా రెడ్డిపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకోగా, కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## గ్రామాభివృద్ధికి సమగ్ర కార్యాచరణ అవసరం

- నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి
- జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** గ్రామస్థాయి నుంచి సమగ్ర అభివృద్ధిని సాధించేలా నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. మంగళవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతితో కలిసి గ్రామాభివృద్ధి ప్రణాళికపై డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీఓలు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్ట ర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలు అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. 16వ ఆర్థిక సంఘం నిబంధనలు, పెసా గ్రామపంచాయతీలు, సభాసర్, నిర్ణయ్ యాప్, ఈ-గ్రామ స్వరాజ్ అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు విధులకు సకాలంలో హాజరై ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పన్నుల వసూళ్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీకి సొంత కార్యాలయ భవనం ఉండేలా చర్యలు తీసుకోవాలని, భవనాలు లేని గ్రామపంచాయతీలలో అనువైన స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల ను త్వరగా పూర్తి చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీజీజీ కన్సల్టె ంట్ మహేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మైనారిటీ విద్యార్థు లకు ఉచిత కోచింగ్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మైనారిటీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ కార్యక్రమం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి షేక్ కలీమ్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ పేపర్–1కు సంబంధించి ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు, గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్–1 పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన, పార్సీ, బౌద్ధ మతాలకు చెందిన అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ మెమోల జిరాక్స్ కాపీలు, రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో తమ దరఖాస్తులను ఈనెల 22వ తేదీలోపు హైదరాబాద్లోని ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కాలేజీ ఆవరణ, ఎంఏఎం క్యాంపస్, ఇంటర్మీడియట్ బోర్డు వెనుక, నాంపల్లి చిరునామాకు సమర్పించాలని సూచించారు. ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే ఈ కోచింగ్ కార్యక్రమం 60 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఇతర వివరాల కోసం పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 040–23236112, 9059050062 నంబర్లలో సంప్రదించాలని, directormsccctelangana@gmail.com ఈమెయిల్ ద్వారా సంప్రదించవచ్చని వివరించారు.

## విద్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

**పాఠశాలల్లో నిర్మాణ పనులు వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతూ ప్రభుత్వ విద్యా సంస్థ ల్లోసకల సౌకర్యాలు కల్పించి విద్యార్థు లకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం చెన్నూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సోమనపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించి, అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో వీవో భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం చెన్నూరు పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన నీటి ట్యాంకు నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, మండల పంచాయతీ అధికారి అజ్మత్ అలీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తుఫాను బాధితులకు బీజేపీ అండ



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట గ్రామంలో ఇటీవల ఈదురు గాలులు, భారీ వర్షాల కారణంగా నష్టపోయిన కుటుంబాలను భారతీయ జనతా పార్టీ నాయకులు పరామర్శించి వారికి అండగా నిలిచారు. బాధిత కుటుంబాల పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పడంతో పాటు తక్షణ సహాయంగా బియ్యాన్ని పంపిణీ చేశారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గుగులోత్ పరశురాములు, భూక్యా దేవేందర్, గుగులోత్ మంగు కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల అర్హులను గుర్తించడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఇళ్లు అవసరమైన పేదలకు కాకుండా రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ప్రయోజనం చేకూరుతోందని ఆరోపించారు. అర్హుల ఎంపికలో పారదర్శకత లేకపోవడం, అవినీతి, సిఫార్సుల కారణంగా నిజమైన లబ్ధిదారులు ఇప్పటికీ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు ఇది తీవ్ర అన్యాయమని అన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని, ప్రజా సమస్యలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండలేదని విమర్శించారు. ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి ఇందిరమ్మ గృహాలను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, డాక్టర్ సత్యనారాయణ, దేవేందర్ గౌడ్, తిరుపతి, శ్రీనివాస్, నర్సింలు, దేవేందర్ యాదవ్, నరేష్, నవీన్, రమేష్, ప్రభాకర్, ఎల్లం గణేష్, స్వామి, శ్రీనివాస్, నాజం, దేవయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.



## వర్షా కాలంలో వ్యాధుల నివారణకు అప్రమత్తంగా ఉండాలి






- **ఆశ్రమ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో వైద్య శిబిరాలు**

**ఉద్యమ కెరటం, తిర్యాణి:** వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిర్యాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. మంగళవారం ఆశ్రమ బాలుర పాఠశాలను సందర్శించి వైద్య సిబ్బందితో కలిసి ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, రక్తహీనత గుర్తింపునకు హీమోగ్లోబిన్ (హెచ్బీ) పరీక్షల కోసం రక్త నమూనాలను సేకరించారు. అలాగే సాధారణ వైద్య శిబిరం నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించి ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంకు సూచనలు అందజేశారు. తిర్యాణి, నాయకపుగూడ అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి తీవ్ర, మధ్యస్థ పోషకాహార లోపం (ఎస్ఏఎం, ఎంఏఎం) ఉన్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం తిర్యాణి ఉప ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పర్యవేక్షణ, రానున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే అంశాలపై ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్యూఓ శ్రీనివాస్, సూపర్వైజర్ రత్నమాల, ఆర్బీఎస్కే బృందం సభ్యులు పాల్గొన్నారు.

## వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- **41 లక్షల మొక్కల నాటడమే లక్ష్యం**
- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసి పర్యావరణ పరిరక్షణకు ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థ లు) పి.చంద్రయ్యతో కలిసి జిల్లా పంచాయతీ అధికారి వెంక టేశ్వరరావు, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో వన మహోత్సవం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని అన్నారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కల నాటకం, సంరక్షణ చేపట్టాలని సూచించారు. ఈనెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా వన మహోత్సవం ప్రారంభం కానుండగా, అదే రోజున జిల్లాలోనూ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. 2026 వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 41 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించామని, దీనిని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నర్సరీలలో అందుబాటులో ఉన్న మొక్కల వివరాలు, ప్లాంటేషన్ సైట్ల నమోదు, ఇతర సమాచారాన్ని సంబంధిత ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. మొక్కల నాటకం అనంతరం జియో ట్యాగింగ్ పూర్తి చేసి, రోజువారీ వివరాలను నవీకరించాలని తెలిపారు. రహదారుల ఇరువైపులా పెద్ద చెట్లు, పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో పూలు, పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. జిల్లాలో గనుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటున్న నేపథ్యంలో ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అటవీ భూముల వివాదాలు ఉన్న ప్రాంతాల్లో వెదురు మొక్కలను నాటాలని, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే మున్సిపాలిటీల పరిధిలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకొని వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- **కేజీబీవీని సందర్శించిన అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థ లు) పి.చంద్రయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమిని మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఏఈకి సూచించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. భవనానికి వెంటనే పెయింటింగ్ వేయాలని, ఆర్ఓ ప్లాంట్ను మరమ్మతు చేయాలని ఆదేశించారు. పాఠశాలకు మంజూరైన బాలికల మూత్రశాల నిర్మాణాన్ని కూడా తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బూత్ స్థా యి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొన్నారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించే దిశగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బికార్నదాస్, ఎంపీడీఓ బి.గంగామోహన్, మండల పంచాయతీ అధికారి మహేష్, మండల విద్యాధికారి వెంకటస్వామి, గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆదిలాబాద్కు ఎయిర్పోర్ట్ కల సాకారం దిశగా కీలక ముందడుగు

- **భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తాం**
- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్లో జాయింట్ యూజర్ (డిఫెన్స్–సివిల్) ఎయిర్పోర్ట్ ఏర్పాటు దిశగా కీలక అడుగులు పడుతున్నాయని, భూసేకరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, బెంగళూరుకు చెందిన ఎయిర్ఫోర్స్ ఉన్నతాధికారులు, రాష్ట్ర సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డితో కలిసి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, రన్వే విస్తరణతో పాటు పలు సాంకేతిక అంశాలపై మైక్రో లెవెల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చర్యలను వేగవంతం చేశామని తెలిపారు. ఇప్పటికే 700 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, అదనంగా డిఫెన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కోసం 1,500 ఎకరాలు, రన్వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలను కేటాయించేందుకు ప్రాథమిక ఆమోదం లభించిందన్నారు. జియో కోఆర్డినేట్ల ఆధారంగా భూసేకరణ చేపట్టి, సీఎంఓ కార్యాలయం, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేసి రక్షణ శాఖ, ఎయిర్పోర్ట్ అథారిటీకి భూములను అప్పగిస్తామని స్పష్టం చేశారు. డిఫెన్స్, సివిల్ ఏవియేషన్ మౌలిక సదుపాయాలు జిల్లాకు రావడం చారిత్రాత్మక అవకాశమని పేర్కొన్నారు.



### ఢిల్లీ స్థా యిలో ఇప్పటికే చర్చలు: ఎంపీ గోడం నగేష్

ఎయిర్పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన లొకేషన్ల పరిశీలన విజయవంతంగా పూర్తయిందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ తెలిపారు. గత మార్చిలో కేంద్ర మంత్రులు రాజ్నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డిలతో ఈ ప్రాజెక్టుపై చర్చలు జరిపామని, మే 15న కేంద్ర ఉన్నతస్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన కూడా నిర్వహించిందన్నారు. రక్షణ శాఖ కోరిన 1,500 ఎకరాల భూమి సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు.

### దశాబ్దాల కల నెరవేరబోతోంది: ఎమ్మెల్యే పాయల శంకర్

జాయింట్ యూజర్ ఎయిర్పోర్ట్ భూసేకరణపై నేటి సమావేశంతో స్పష్టత వచ్చిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి మొత్తం 1,840 ఎకరాలు అవసరమవుతాయని, ఇందులో 1,500 ఎకరాలను రక్షణ శాఖకు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందన్నారు. ఇప్పటికే 360 ఎకరాలు రక్షణ శాఖ పరిధిలో ఉండగా, రన్వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలు అవసరమని వివరించారు. 700 ఎకరాల భూసేకరణకు సంబంధించి జారీ చేసిన జీవో ప్రకారం పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన భూముల అనుమతుల ప్రక్రియ కూడా వేగంగా కొనసాగుతోందన్నారు. త్వరలో ఎంపీ నేతృత్వంలో ఢిల్లీలో రాష్ట్ర, కేంద్ర స్థాయి సమావేశం నిర్వహించి తదుపరి విధానపరమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు వివరించారు. ఈ సమావేశం, క్షేత్రస్థాయి పరిశీలనలో అదనపు కలెక్టర్లు ఆర్ఎస్. చిత్రు, ఎస్.రాజేశ్వర్, ఎయిర్ఫోర్స్ ఉన్నతాధికారులు జేపీ సబర్వాల్, ఎస్.జి. హెడ్గే, ఎస్.కె. రెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్, ల్యాండ్ సర్వే ఏడీ ప్రభాకర్, తహశీల్దార్లు శ్రీనివాస్, గోవింద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## 18న సీజీఆర్ఎఫ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార సమావేశం

- **విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి: సెస్ ఏఈ ఆనంద్ కుమార్**

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** విద్యుత్ వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరమ్ (సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఈనెల 18న ఎల్లారెడ్డిపేటలో నిర్వహించనున్నట్లు సెస్ ఏఈ ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో గంభీరావుపేట మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. విద్యుత్ బిల్లులు, కొత్త కనెక్షన్లు, విద్యుత్ సరఫరా అంతరాయాలు, మీటర్ సమస్యలు, ఇతర విద్యుత్ సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను సీజీఆర్ఎఫ్ ఫోరమ్ ముందు ఉంచి పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

